వివాహబలి

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారు

౧

ఏమాట కామాటయే చెప్పవలెఁ; సూపర్నెంటు అంతకుముందు బేడీలు వేయింపకయే ఖైదీలచే తన వాకిట పని చేయించుకొనుచుండెడివాఁడు. ఇటు లుండఁగా ౧౩౪౭ వ నెంబరు ఖైదీ అందఱికంటె నమ్మకముగా పని చేయుచు తప్పించుకొని పాఱిపోయెను. ఎంత ప్రయత్నము చేసినను వాని యానుపానులు దొరకలేదు. ఈ దుర్నయముచే ఖైదీ లందఱును మరల బేడీలు వేయించుకొని పనిచేయవలసినవా రయిరి.

౧౩౪౭ తప్పించుకొని పోయినందువలన సూపర్నెంటుకు మాటరాలేదా? యని శంక కలుగవచ్చును. సూపర్నెంటు చాల చతురుఁడు. దిక్కులేని బిచ్చగాని నొకని దెచ్చి ౧౩౪౭ గాఁ జేసెను.

నాఁటినుండియు ఖైదీలకు వదులుగా గొలుసులు వేయఁబడుచుండెను. ఆ గొలుసులను గొంచె మటునిటు సర్దుకొనుచు నడుమ నడుమ మాటలు చెప్పుకొనుచు జీతనాతములు లేక సూపర్నెంటు వాకిట పనిపాటలు చేయుచున్న ఖైదీలు కొంద ఱొక్కపర్యాయములికిపడిరి. జైలుసూపర్నెంటు తన బంగళాలో డ్రాయింగురూమునుండి రీడింగురూములోనికి వెళ్లెను. ఖైదీలకన్నులలో వైర్లెస్ తెలిగ్రాములు నడచెను. ఖైదీలందఱును తమ తమ పనులలో మునిఁగిపోయిరి.

సూపర్నెంటు తన వ్రాఁతబల్లకడ నిలిచి దానిమీఁద నున్న ఉత్తరముల నన్నిఁటిని దీసికొని పయిపేరు మాత్రము చూచుచు ఒక్కొక్క యుత్తరమునే బల్లమీఁదఁ బడ వయిచుచుండెను. తుద కాయుత్తరములనన్నిఁటిని కట్టగా కట్టి నేలకు విసరికొట్టెను. కోపము చెందినటులు ఆకట్ట ప్రిదిలెను. ఉత్తరములన్నియు చిందరవందరగా నేలపైఁ బడెను.

సూపర్నెంటు వట్టిమాటలప్రోగు కాఁడు; కార్యశూరుఁడు. పిదప నతఁడు నిస్సహాయములయి పడియున్న ఆయుత్తరములపై తాండవమే చేసెనో, మఱి యేమిచేసెనో కాని ప్రతి యుత్తరమును అతని కాలిజోడుక్రింది లాడముల చేఁపగుఱుతులను తల దాల్చెను.

అతని యీపనివలన భూదేవి యేడుపువలె నొక శబ్దము బయలుదేఱెను. నేల మీఁదిగచ్చు ముక్కలు ముక్కలై లేచెను. అతఁడు తనబలమునకు సంతసించి కాఁబోలు ఆ గచ్చుముక్కలను చేతఁబుచ్చికొని పరీక్షించెను.

వాకిటఁ బనిచేయుచున్న ఖైదీల మోములలో అతికష్టముగా ఆఁపుకొనఁబడిన నగవు వారి దవడల నుబికించి ముక్కులను వెడద చేయించి నోరుమూయించెను. సూపర్నెంటు

పదధ్వని నియత తాళమానములతో ద్వారము కడకు వచ్చుచుండెను. ఖైదీలు కుక్కినపేల వలె తమతమ పనులలో నప్రమత్తు లయి యుండిరి.

సూపర్నెంటు వాకిటికి వచ్చి కుర్చీలో కూర్చుండి ఒకరొక్కరినే చూచెను. దొర గారి కందఱును సలాము చేసిరి. ఒకఁడు మాత్రము పనిపోవునని కాఁబోలు సలాము చేయ లేదు. అతని నంబరు౧౫౪౨.

నూటయాభై యేడూ, అని సూపర్నెంటు పిలిచెను. అతఁడు ఉలికిపడి చూచి దాపునకు వచ్చెను. సూపర్నెంటు తనబూట్సులుచూచు కొనెను. బూట్సులుగూడ నతని కడలి కొంత చినిఁగెను. 'ఈబూట్సులు విప్పు' అని సూపర్నెంటనెను.

సలాము చేయనందులకు చెప్పుదెబ్బల వ్రాఁత వీని మోమున వ్రాసియున్నదని వారంద ఱనుకొనిరి.

౧౫౪౨ సూపర్నెంటు కడకు వెళ్లి వంగి చూచి—'ఏలినవారిపాదాలు చెప్పులను కఱచినవి. ఇంకా వాట్లకోపం చల్లాఱినట్లు లేదు; రక్తం కక్కుతున్నవి' అని నోటిమీఁద చేయి వేసికొనెను.

సూపర్నెంటు ౧౫౪౨ బుజమును తట్టి 'విప్పు' అనెను. ౧౫౪౨ విప్పి మేజోళ్లతో బూట్సులను తీసెను.

ఖైదీ లందఱును ౧౫౪౨ ఒంటిమీఁద చెప్పుదెబ్బలనువినుటకు సంసిద్ధులయి యుండిరి.

చప్రాసీ యొకఁడు లోపలినుండి క్రొత్త మేజోళ్లను క్రొత్తబూటుసులను తెచ్చినిలిచెను. సూపర్నెంటు ౧౫౪౨ ను చూచి ఆ బూటుసులకు సలాము చేయుమనెను. ౧౫౪౨ బూటుసులకును, పిదప సూపర్నెంటునకును సలాము చేసెను. ఖైదీలు లోలోపలనే నవ్వుకొనిరి. 'ఆబూట్సుంత్రో ఆదవడ ఈదవడ కొట్టుకో' అని సూపర్నెంటనెను.

'నాయంతట నేను కొట్టుకొను నలవాటు లోఁగడ నాకులేదు' అని అతఁడు వడివడిగా తన రెండు దవడలను కొట్టుకొనుట నభినయించెను. సూపర్నెంటు ౧౫౪౨ మొగము నొకతూరి చూచెను. అతఁడు మఱొకమాఱు సలాము చేసి తనపనికి వెళ్లిపోయెను.

చప్రాసీ మేజోళ్లును బూట్సులను సూపర్నెంటుకు తొడిగెను. సూపర్నెంటు మెల్లగా అడుగులు పెట్టుకొనుచు రీడింగురూములోనికిఁ బోయి కూరుచుండెను. అతని వెనువెంటనే చప్రాసీకూడ వెళ్లి నిలువఁబడియుండెను.

'కారు తీసికొనిరమ్మను పో' అని సూపర్నెంటనెను. సెలవు దొరకినటులు చప్రాసీ పరువెత్తెను.

పదినిమిషములలో కారు వచ్చి వాకిట నాఁగెను. తూనీఁగవలె సూపర్నెంటు కారులోని కుఱికెను. జయఘోష మొనరించుచు కారు పరువిడెను.

ఖైదీల కాలిగొలుసు లన్నియు ఒకతూరి గలగలమనెను. పనులు ముగించి యెచటివారచటఁ గూలఁబడిరి.

'ఇవ్వాళ నాటయ్యాళ్ళై యేడుకు గండం చిత్రంగా దాఁటేందిరా' అని ఒకఁ డనెను.

'దొరకు పిచ్చియెత్తెనేమోరా! గదిలో ఒకటేగంతులు' అని ఒకఁ డనెను.

'కాదురా, పెళ్లికి డేన్సు నేర్చుకుంటున్నాఁడురా' అని ఒకఁ డనెను. అందఱును ఆమాటనే సిద్ధాంతము చేసిరి.

౨

మోటారుకారు స్త్రీల చెఱసాలకడ నాఁగఁగనే మొగసాల తెఱవఁబడెను. సూపర్నెంటు దిగి లోని కేఁగెను.

అచట పెద్దయుద్యోగమునందున్న ఆంగ్లో ఇండియన్ దొరసాని డిక్కు అనునామెయు సూపర్నెంటును కరస్పర్శ గావించుకొనిరి. కాసుపాసు మని మాటలాడుకొనిరి. దొరసాని తనపనిమీఁదఁ బోయెను. ఆఫీసుగదిలోఁ గూరుచుండి సూపర్నెంటు కాకితములుచూచుకొనెను.

దొరసాని ఖైదీల నందఱను బారుగా నిలువఁబెట్టెను. సూపర్నెంటు వారిని పరీక్షించుటకు వెళ్లెను. ఖైదీలుపలువు రతనికి సలాము చేసిరి. కొందఱు కరస్పర్శగావించిరి. కొందఱు మ్రోడులవలె నిలువఁబడిరి. కొందఱు ప్రక్కకుఁ దిరిగి చూచుచుండిరి. కొందఱు తల గోఁకుకొనుచుండిరి. మఱికొందఱు వంగి నేలను పాదములను జూచుకొనుచుండిరి.

దొరసాని సూపర్నెంటుకుఁ దెలియకుండ 'తిన్నగా నిలువుఁ' డని సైగచేసెను. దాని నెవరును పాటింపలేదు.

సూపర్నెంటు 'మిస్ డిక్!' అని పిలిచెను.

దొరసాని కొంచె ములికిపడెను. తనకు పిలుపు వచ్చునని యామె యనుకొనలేదు. ఎవరిమీఁద సూపర్నెంటు కొరడా పడునో యనియే యామె భీతిల్లుచుండెను. ఇట్టిస్థితిలో ఈపిలుపు. 'యెస్ మిస్టర్ హెన్రీ!' అని యామె యనెను.

'చూచితివా ౩౭౬ ను?'

'చూచితిని' అని బదులుపలికి 'అమ్మా! తిన్నగా నిలు!' అని ౩౭౬ తో ననెను. ౩౭౬ నిశ్చలముగా నిలువఁబడియుండెను.

సూపర్నెంటు ౩౭౬ లలాటమును ఆచి చూచెను. అతనిచూపు మొగమునుండి పాదములవఱకును మెల్లఁగాఁ బ్రసరించెను. ౩౭౬ కు ఆచూపు తొండ్రపాఁకినటు లుండెను. ఆమె Insult!-Insult!(అవమానము!అవమానము!) అనుచు అనుజ్ఞగొనకయే వెళ్లిపోయెను. పిదప నొకరితరువాత మఱియొకరు ఖైదీ లందఱును వెళ్లిపోయిరి.

సూపర్నెంటుముఖ మంతయు మసి పూసినటు లాయెను. ఇంతలో డిక్కుకల్పించుకొని యేదోమాట యెత్తనిచో నతఁ డచేతనుఁడే యగువాఁడో, లేక ఉగ్రుఁడే యగువాఁడో యెవరు చెప్పఁగలరు?

'౩౨౬ నెలరోజులు జ్వరపడి యిపుడిపుడే కోలుకొనుచున్నది' అని డిక్కనెను.

'ఓ యెస్ మదామ్, ఓ యెస్ మదామ్' అనుచు సూపర్నెంటు డిక్కచేయి పట్టుకొని యూఁపెను.

వెనువెంటనే అతఁడు మొగముచిట్లించుకొని 'చూచితివా ఈఖైదీలు నాకెంత తిరస్కారము చేసిరో!'

'ఔనౌను.'

సూపర్నెంటు అవుడు కలఁచి ఆలోచించుచు నిలువఁబడెను. కొంతవడి కాలము స్తంభించిపోయెను. డిక్క గుండియ లుడ్డుగుడుచుకొనెను.

'హిందూస్త్రీలను నేను Fair-sex అనను.'

'ఔ' నని డిక్క నవ్వెను.

'నాముందర ఆఁడువారింతటి అవినయము చేయుదురా? పశువులు!'

'పశువులు!' అని డిక్క అనువదించెను.

'కాఁబట్టి...కాఁబట్టి......' అని యేమేమో అనఁబోవుచు సూపర్నెంటొకసారి డిక్క మోమును జూచెను. ఆమె బిక్కమొగము కళాయిలేని అద్దమువలె నుండెను.

'చూచితివా?'

'ఆఁ.'

'పందు లీలెపోటులతోఁగాని మరలవు. ౩౨౬ తప్ప తక్కిన వీరందఱకును ఈరాత్రినుండి మూఁడురాత్రులవఱకును నిలువు బేడీలు వేయింపుము. వీరికి నడుమ నడుమ ఇట్టి పాఠములు చెప్పుచుండవలయును.'

'౩౨౬ తప్ప తక్కినవారికా?'

'ఔను.'

'సరియ' అని డిక్క లోలోపల నవ్వుకొనెను.

'డిక్!'

'ఆఁ.'

ఏమో అనవచ్చి ఆఁగిపోయి సూపర్నెంటు డిక్కచేతుల నొకపరి ఊఁపి ౩౨౬ గది కడకు వెళ్లెను.

౩౨౬ పాలిపోయియుండెను. తలముడుచుకొనుట కోపిక లేక ఎఱ్ఱబాఱిన వేసలి నామె యెత్తి కట్టుకొనుచుండెను. బొట్టు పెట్టుకొనుటకు చెఱసాల నియమము లంగీకరింపవు. ఈ రీతిగా నున్న ౩౨౬ మోము పున్నమనాఁటి వేకువ చందమామ.

సూపర్నెంటా చందమామను జూచుచు నిలువఁబడెను. అతనిహృదయానందము కన్నులకుఁ బెట్టని కాటుకగా మాఱెను. కొంతవడి చూచి యతఁడు గదిగుమ్మముమీఁదికి కాలిడఁబోయెను. వెనుకనుండి డిక్క వడిగా వచ్చెను. లోపల పరధ్యానముగా నున్న ౩౨౬ సూపర్నెంటును హఠాత్తుగా చూచి గదితలుపును గభాలున వైచెను. ఆతలుపు హాహాకారము చేసెను. సూపర్నెంటు తొందరపడి వెనుదిరిగెను. డిక్కను తప్పించుకొని ఆఫీసు గది

లోనికిని, పదఁపడి మోటారులోనికిని బోయెను. మఱునిముసముననే మోటారు 'బుంయి' మనెను.

డిక్కు 328 గదిలోనికి వెళ్లెను. 328 ఎడ మొగము పెడ మొగముగాఁ గూరుచుండెను. డిక్కు దాపున కేఁగి కూరుచుండెను. కొంతసేపటులు కూరుచుండి — 'చూచితివా లక్ష్మీ! దొరగారికి మీమీఁద చాల ప్రేమ.'

'ఛీ పాడుప్రేమ! నామీఁద ప్రేమఏమిటి? నీమీఁద కాదూ?'

'ఔను. నామీఁదనూ ప్రేమే. ఐనను మీమీఁద ఎక్కువ.'

'ఇంకొకతూరి ఇటు లనవలదు. ఇప్పటికి క్షమించితిని.'

'కాదమ్మా! తొందరపడవలదు. మఱేమియు తప్పులేదు. నీ మొగమున కేతరీను పోలికయున్నది. కేతరీను ఎవరో తెలియునా? దొరగారు ఇఁక ఆమెను పెండ్లిచేసికొందురు.'

'ఏమీ, చెప్పకపోతివి!' అని లక్ష్మి రఁయిమని లేచి రెండుబొగ్గులు నూఱి మొగమంతయు పులుముకొనెను.

డిక్కు తెల్లఁబోయెను. 'నయమే, ఇచట కత్తులును కటారులును లేవు' అని అనుకొనెను. 'లక్ష్మీ! నీవు తొందరపడకు! నేనుండఁగా మీకే యపాయమును లేదు. మీ రందఱును మామూలుగా ఆడుకొనుఁడు. దొరగారు వచ్చినపుడు మాత్రము బడిపిల్లలవలె నుండుఁడు' అని ఆఫీసుగదిలోనికి వెళ్లిపోయెను.

పరిచారకుఁడొకఁడు వాకిట వ్రేలాడుచున్న కంచుసిబ్బిమీఁద నాలుగుమాఱులు కొయ్యగూటముతో కొట్టెను.

ఆఁడువా రందఱును ఆటలకు లేచిరి. ఖైదీలకు కాలిబేడీలు చెప్పకయే డిక్కు ఆఫీసుగదినుండి వెళ్లిపోయెను.

సూపర్నెంటు డిక్కు ఈ యిరువురును ఆస్థలమును ఖాళీ చేయఁగనే స్వాతంత్ర్యము కొంచె మాస్థలము నాక్రమించెను.

3

కారు మగవారి జైలుగోడలకు ఫర్లాంగు దూరమున ఆఁగెను. సూపర్నెంటు దిగి కొంతదవ్వు నడచిపోయి చెఱసాల బయటి గోడల బీటికలనుండి పొంచి చూచుచు నిలువఁబడెను.

చెఱసాల మొగసాల తెఱవఁబడెను. తలమీఁద నీలి పోలీసుపాగాయును, పావురాయి రంగు గల చొక్కాలాగూలును, చేతిలో లాఠీయును దాల్చిన వార్డ రొకఁడు గర్వముతో బయటికి వచ్చెను. ఆవార్డరులను ఖయిదీలు సిపాయీ లని వ్యవహరింతురు. ఆసిపాయి వెనుక నలుగురుఖయిదీ లొకబరువు బండిని లాఁగికొని వచ్చి బయటి పిట్టగోడ ప్రక్క నున్న చెట్టుక్రింద దింపిరి. సిపాయి దాపున నున్న ఒకచిన్నయింటిలోని కేఁగెను.

ఆబండి కెదురుగా నొకద్వారము కలదు. దాని తలుపులు తెఱవఁబడియుండెను. తమ బంధువులగు ఖయిదీలను కొందఱను జూడవచ్చిన యిద్దఱు ఆఖయిదీలను బరువుబండిని బెరుకు బెరుకుగా చూచుచు వెలుపటి రోడ్డుమీఁద నిలువఁబడియుండిరి.

ఇంటిలోనికేఁగిన సిపాయి చాటుగాఁబిలిచి ఖయిదీలను జూచుచుండెను. రోడ్డుమీఁద నిలువఁబడిన ప్రేక్షకులు ఖయిదీలను విచిత్రముగాఁ జూచుచుండిరి. జమఖాణపుగీటులు గల పొట్టిచొక్కాలును, పట్టిలాగులును, నెత్తి కంటుకొనియున్న పిచ్చికుళ్లాయిలును గల ఖయిదీల వేసములు వారిమనస్సు కరఁగించెను.

ప్రేక్షకులు తమదెస నదేపనిగా చూచుచుండుట ఖయిదీలలో నొకఁడు కనిపట్టెను.

'పొగాకుకు ఏదయినా ఒకడబ్బు ఇయ్యండి. సిపాయి వస్తాఁడు. వాఁడు చూస్తే మాకు దక్కదు. దబ్బునఇయ్యండి' అనిఖయిదీఅనెను.

ప్రేక్షకుఁడు బేడకాసొకటి విసరెను. ఖయిదీ దానిని కాలిబొటనవ్రేలితో నొక్కిపట్టుకొని అటు నిటు చూచి తీసికొనెను.

'సిపాయి చూచుచో మీకిది దక్కదా? పాపము!' అని రెండవ ప్రేక్షకుఁడనెను.

'దయ్యంముందర బిడ్డలా అండి! నాకో డబ్బు పారెయ్యండి' అని రెండవఖయిదీఅనెను.

'అదేమి? ఆబేడ మీరు పంచుకొనుఁడు!' అని మొదటిప్రేక్షకుఁడనెను.

'బాబూ! వాఁడింకా మాకిస్తాఁడాండీ!' అని రెండవఖయిదీ అనెను.

'ఏమిరా ఈయవ్వా?' అని మొదటి ప్రేక్షకుఁడనెను.

'ఇది నాకు అర్ధాకలి. ఇందులో జవానుకు భాగం. సిపాయికి భాగం. ఒకఅణా మిగిలితే కోమటి ఒకతుంపు ఇస్తాఁడు' అని మొదటి ఖయిదీ అనెను.

'పోనీ పాపము!' అని రెండవప్రేక్షకుఁడొకబేడకాసు గిరవాటు వైచెను. మూఁడవ ఖయిదీ దానిని పాదముతో నొక్కిపట్టి లాఁగుకొనెను.

'చూచితిరా బాబయ్యా, వీఁడు లాఁగుకున్నాఁడు. మఱొకటీ పారెయ్యండి.' అని రెండవఖయిదీ అనెను.

'ఓరీ మీదుంపలు తెగ! మీరు నలుగురూ నాలుగణాలు పంచుకొనుఁడు! మీరు గజదొంగలు కాఁబట్టే మీకీగతి పట్టింది' అని మొదటిప్రేక్షకుఁడనెను.

'బాబూ వాళ్లు మా కియ్యరు. సిపాయి వచ్చే వేళయింది. మఱిరెండుబేడలు పారెయ్యండి' అని రెండవఖయిదీ అనెను.

'మీరేమినేరము చేసితిరిరా!' అని యడుగుచు ప్రేక్షకు లిరువురును చెరియొకబేడ విసరిరి. ఆరెంటిని రెండవఖయిదీ వేగవలె పట్టుకొని బొడ్డులో దోఁచికొని —'అయ్యా మేము దొంగతనం చేశాం; ఇహ బుద్ధివచ్చింది' అనెను.

'అయ్యా, చూశారా, బేడలు రెండూ మీరు చూస్తుండంగానే వీఁడు దొంగిలించాఁడు. ఇహ దొంగతనం చెయ్యఁడఁట! చూచారా! బుద్ధివచ్చిందఁట! బాబయ్యా! నాకో బేడా పాతెయ్యండి!' అని నాలుగవ ఖయిదీ అనెను.

'ఛీ ఛీ మీ కిచ్చుట మాదే తప్పు. మాకే బుద్ధి వచ్చినది' అని ప్రేక్షకు లనుచుండఁగా సిపాయి వడివడిగా నచటికి వచ్చెను. ఖయిదీలు ముగ్గురు బండిచాటునకు వచ్చి దాఁచిన డబ్బును దీసి మ్రింగిరి.

సిపాయి ప్రేక్షకులను బిలిచి 'ఏమి మాటలాడుచున్నారు? ఖయిదీలతో మాటలాడఁగూడ దని మీ రెఱుఁగరా? మీకు శాస్తి జరుగును' అనెను.

'మాకు తెలియదు మాకు తెలియ'దని ప్రేక్షకులు నసిగిరి. 'మీరు వారి కేమి యిచ్చితి' రని సిపాయి యడుగుచుండఁగా ఖయిదీలొక రొక రొకరొకరిని చాటుచేసికొని ప్రేక్షకులకు చేతులు త్రిప్పుచు సైగలు చేసిరి. గ్రహించి ప్రేక్షకులు 'ఏమియు ఈయలేదు' అనిరి. సిపాయి తల యూఁచెను.

ఖయిదీలు పొండని ప్రేక్షకులకు సైగ చేసిరి ప్రేక్షకులు వడివడిగా పోఁదొడఁగిరి.

'భయము లేదు, ఉండుఁడు.' అని సిపాయి యనెను. ప్రేక్షకులు నిలువఁబడిరి.

సిపాయి ఖయిదీల కుళ్లాయితీసి తల తడవెను. లక్ష్మి సామాన్యముగా దాఁగులాఁడి కదా! చెవులలోనికి చిటికెనవ్రేలు పోనిచ్చి శష్కులివఱకు వెతకెను. ముక్కుమూలము దాఁక శోధించెను. ఒడ లెల్లెడ పరీక్షించెను. సిపాయిలకు సిగ్గులేదు; ఖయిదీలకును సిగ్గు లేదు. తుద కతఁడు విసికి ఒకఖయిదీని వంచి మెడమీఁద ఒకగ్రుద్దు గ్రుద్దెను. కొంత రక్తముతో కలిసి రెండు బేడలు నేలపైఁ బడెను. తక్కిన యిరువురును ఓక్కురోక్కురు మని కాఁడి - యుమిసి కంఠకూపమునుండి రెండు బేడలఁ దీసిరి. సిపాయి వానిని వారిచేత నే తుడిపించి తీసికొని జేబులో వేసికొనెను. ప్రేక్షకులు నిలువున నీఱయిపోయిరి.

ఆసమయమునసూపర్నెంటు రంగమునఁ బ్రవేశించెను. పొండు పొండని ఖైదీలు సంజ్ఞ చేయులోపలనే సూపర్నెంటు కొరడా వారి వీఁపులమీఁద ముద్రవేసెను.

సిపాయి నాలుగుబేడలను దెచ్చి సూపర్నెంటుముంగల నిలిచెను.

సిపాయి చేయి వాచెను. ఖైదీల కాళ్ల నుండి రక్తము కురిసెను. ప్రేక్షకులు తమ బందుగులను జూచుట కనుజ్ఞ గోరకయే పరుగెత్తిరి. సూపర్నెంటు కొరడా తెగిపోయెను.

౪

అచటినుండి అన్నిమూలలు పరిశీలించుచు సూపర్నెంటు మొగసాలకడకు వచ్చెను. డ్రైవరుమోటారునుగూడ నచటికి తోలి నిలిపెను.

వాకిట పారాయిచ్చుచున్న సిపాయులు అప్రమత్తులయి సెల్యూట్ చేసిరి. సూపర్నెంటు చూపులు ముండ్లా యేమి?—ప్రతి వానికిని గ్రుచ్చుకొనియెను. సూర్యుఁ డతని తేజమున కోడి చెఱసాల గోడచాటున కేఁగెను. సిపాయులు బాకాలూఁదిరి. ఉద్యోగుల వందనము లందికొనుచు సూపర్నెంటు చెఱసాల లోని కేఁగెను. అతఁడు లోని కేఁగఁగనే మోసాల తలుపులు మూయఁబడెను.

చెఱసాలచుట్టును తాటియెత్తురాతిగోడ. గోడలోపల వందల యెకరముల నేల. అర్ధ చంద్రాకారముగాఁ గట్టఁబడిన ఖయిదీల గదులు. ఉరి తీయఁదగిన వారి గృహాలు. మాఱుమూల వధ్యశాల. సూపర్నెంటుకు అన్నియు కనువిందొనర్చుటకు గోపురాకారముగాఁ గట్టఁబడిన ఎత్తగు మేడ. దుమ్ము దూగర లేని ఘంటాపథములు. లోఁతు లేని నూతులు. గోశాలలు. అచ్చు కూటములు. తివాచీ నేఁతసాలలు. గానుగలు. ఇట్టి చెఱసాల మొగము స్వర్గము; గుండె నరకము. అందు పయివానికి వింతలు వినోదములు; లోపలి వారికి చింతలు, చికాకులు. అందు మానవులతోపాటు మహావృక్షములును జన్మశిక్ష ననుభవించుచుండెను. వానితోపాటు అందు బంధింపఁబడిన ఘంటాపథముమాత్రము అనేకులను చెఱిలోనికిఁ దెచ్చుచున్నను కొందఱ విడుదలకు దారి నిచ్చుటచేఁ గలకలలాడుచుండెను. సూపర్నెంటు ఆరస్తామీఁద నడచిపోయి ప్రత్యేకముగా కట్టఁబడియున్న ఒక గుహాచెంతకుఁ జనెను.

ఆగుహ గ్రుడ్డిది. దానికి తలలేదు. దాని క్రింద చవుడు. దానికొక వ్రేలెఁడుకంత గలదు. దానిలోనుండి చూచినచో కను లంధకారమయి పోవును.

ఆ గుహాలో నొక పురుషుఁడు కలఁడు. అతఁ డాజానుబాహువు. అతనికనులుచేరెఁడు; రొమ్ము బారెఁడు. కంఠముశంఖము. ముఖము సూర్యబింబము.

అతఁడు బయటి యలికిడి విని వంగి కంతలో నుండి చూచెను. ఎట్టెదుట సూపర్నెంటు.

అతఁ డాసూపర్నెంటును జూచి గాలికి మొగ్గని పర్వతశిఖరమువలె నిలువఁబడెను.

తనకు సలాము చెప్పక నిలువఁబడియున్న ఖైదీని జూచి సూపర్నెంటు లోలోపల మండిపడెను. ఖైదీ ఆమంట నార్పను లేదు; ఎక్కువచేయను లేదు కావున ఆమంట యినుపగుండువలె మండి మండి తనలోఁ దానే చల్లాఱఁజొచ్చెను.

కొంతవడికి సూపర్నెంటు 'ఇరువది యయిదువందల అరువదియేడూ' అని పిలిచెను.

'ఆఁ.'

'నీ ఉరి రేపే.'

'నే నెల్లుండి యనుకొనుచున్నాను. రేపే యగుచో చాలమంచిది. బంధుదర్శనమువలనఁ గలుగు శోకము తప్పిపోవును.'

'నీ బంధువు లెవరు వత్తురు?'

ఆప్రశ్నకు సమాధానము రాలేదు. సూపరెంటు కొంచె మాగ్రహముతో 'ఎవరా బంధువులు?' అనెను. సమాధానము రాలేదు. సూపరెంటు 'మీకుటుంబము వారి కెవరికిని ఇచటికి వచ్చుట కనుజ్ఞ లేదు. ఇంక బంధువు లెవరు?' అనెను. మరల సమాధానము రాలేదు. ముమ్మాఱులకును సమాధానము రానందువలన సూపరెంటు కన్నులు రక్తము కురిసెను. మఱి చేయునది లేక అతఁడు 'రేపు సిద్ధముగా నుండుము' అనెను.

'నేను సిద్ధముగా నుండుటదేమి? మీరే సిద్ధముగా నుండవలయును.'

ఈసమాధానము నాలోచించుకొనుచు సూపరెంటు వెనుదిరిగెను. అచటనచట దీపములు వర్షాకాలనక్షత్రములవలె మిణుకు మిణుకుమని వెలుగఁదొడఁగెను. తమతమ పనులనుండి గూండ్లకు మరలుచున్న బందీలు చేతులయి సూపరెంటుకు వంగి వంగి సలాములు చేయుచు తప్పుకొనుచుండిరి. 'మీరే సిద్ధముగా నుండవలయును, మీరే సిద్ధముగా నుండవలయును' అని యనుకొనుచు తల వంచుకొని సూపరెంటు దూసిన యమ్మువలెఁ బోయి కారులోఁ గూరుచుండెను. డెప్యూటీజైలరు జైలరు వైద్యులు మొదలగు ఉద్యోగులువచ్చి సెలవుగొనకముందే కారు వెళ్లిపోయెను. సిపాయీలు బాకా లూఁదిరి.

'ఇపుడు దొరగారు ఆఫీసుకాకితముల నయినను తిన్నగఁ జూచుటలేదేమి?' అని డెప్యూటీజైలరు జైలరును అడిగెను.

'దొరగారిపెండ్లి ఎల్లుండి. అదియే పది యాఫీసులంతపనిగా నున్నది.'

'దొరగారి కింతవఱకు పెండ్లి కాలేదేమి?'

'సూపరెంటుకు పిల్ల నెవరిత్తురు?'

'జైలరు కిత్తురేమి?'

'జైలరునకును ఈయరు. జైలరును గాకముందే నాకు పెండ్లి ఆయెను. కొన్నియుద్యోగములకు బాల్యవివాహములు మంచివి.'

'సంతకములు చేయవలసిన కాకితములు చాల నున్నవి. రేపు టపాలో పంపవలెను. దగ్గఱకుఁ బోవుచోఁ బెండ్లికొడుకు చిర్రు బుస్సు మనుచున్నాఁడు. నడుమ నాపని పిడుచకట్టునట్టు లున్నది.'

'దొరపెండ్లి యెల్లుండి. ౨౫౬౭ కు ఉరి యెల్లుండి. ఈచిక్కులో దొరగారి పెండ్లికి ముందు మనకు పెద్దపెండ్లిగా నున్నది. రేపు ప్రొద్దున బంగళాకు వెళ్లుఁడు. దొర మిమ్ముల నచట నిలుపఁడు. వెంటనే వ్రాలుపెట్టి మిమ్ము తోలివైచును. దీనికన్న వేఱుపాయము లేదు.'

'ఉహు, నేను పోను. హిందువులకు ఎట్టికెట్ తెలియదని సందించును. కాకితముల నింటికిఁ బంపుదును.'

ఏ రిటులు మాటలాడుకొను చుండఁగా వైద్యులు వచ్చిరి. అందఱును వెడలిపోయిరి.

౫

సూపర్నెంటు ఆఫీసు-కాకితములమీఁద దస్కతులు చేసెను. వసారాలో అటు ఇటు పచారుచేయుచు నడుమనడుమ దారికేసి తల యెత్తి చూచుచుండెను.

తపాలావాఁడు వచ్చెను. సలాము చేసి ఒక ఉత్తరములకట్టను బల్లపయి నుంచెను. సెలవుగొని వెళ్లిపోయెను.

వెంటనే సూపర్నెంటు గబగబ ఆయుత్తరముల నన్నిఁటిని దిరుగవేసెను. వానిలో నుండి రెండు ఉత్తరములను దీసికొని డ్రాయింగురూములోనికిఁ జని తలుపులు మూసికొనెను.

ఆతఁడాయుత్తరములలో దేనిని ముందు తెఱచుటకును పాలుపోక నాలుగైదు నిమిషములు తటపటాయించెను.

అం దొక కవరు తీసికొని ఆకేకరాక్షులతో తిలకించెను. పిదప మెల్లగా విప్పెను. రెప్పవాల్పక చూచెను. అందు మూఁడే బంతులు. మూఁడుబంతులను ముమ్మాఱు చూచి యతఁడు దానిని పుష్పపాత్రమున నుంచెను.

రెండవ యుత్తరమును విప్పుచుండఁగా నతనిచేతులు నట్టుపడెను. గుండియలు స్పందించెను.

'—మీ రెండవ దరఖాస్తుగూడ అందెను. ఇపుడు చాల చిక్కులు గలవు. ఈ తడవగూడ మీపెండ్లికి సెలవీయఁబడ దని చెప్పవలసివచ్చినందులకు చింతగా నున్నది.'

సూపర్నెంటు మొగము మొదట కొంచెము వాడు చూపెను. పిదప గీచినకందయాయెను.

అతఁ డా యుత్తరమును డ్రాయరుమీఁదఁ బడవయిచి యొక గ్రుద్దు గ్రుద్దెను. పిదప చేతితో లాఁగి నేలఁబడవయిచి కాలితో మట్టెను. అది యెంత మొండిదోగాని చినుఁగ లేదు.

అతఁడు చాల మితభాషి. కాని అతని మితభాషిత్వ మపుడు నడలెను. అవసరమైన అసంభాషణము మాత్రము పాడియా?

అతఁ డిటుల నెను :— సూపర్నెంటుకు రెండుమార్లకుఁగూడ సెలవు దొరక లేదు. అందులో పెండ్లికి. సూపర్నెంటు కీటమా? అయినను సూపర్నెంటు ఒకరిసెలవు గతుక నేల? నాకు నేనే సెలవిచ్చికొందును; చూతును వీరు చేయునది.

నాకడ నాకు సెల వెందులకు? సెలవను మాట నీచము. నే నిచటనేయుండి అచట కేశరీనును పెండ్లియాడుదును.'

అతనిశరీరము చెమురు దోఁగెను. మోమును వంకరగాఁ బెట్టి యతఁ డాయుత్తరమును జూచి—'చీ నీమొగము చూడరాదు' అని దాని నవలఁ బాఱవయిచి అచటికిఁజని మరల దూరముగా తన్ని త్రొక్కి తాండవించి

రెండవచీటి దీసికొని ఆగదమూసి పడకగది లోనికి వెళ్లిపోయెను.

తరువాత ఆబంగాళాతలుపు లన్నియు మూయఁబడియెను. పట్టపగలు ఆ బంగళా నిద్రించెను.

సాయంసమయమున బంగళాముంగలకు డ్రైవరు మోటారును తీసికొనివచ్చెను. తలుపు తెఱచికొనివచ్చి సూపర్నెంటు అందధిష్ఠించెను. అది పెద్దజైలునకుఁ బోయెను.

సిపాయులు జైలుముంగల డేరామేకుల వలె నిలువఁబడియుండిరి. వారి 'సెల్యూటు' గూడ వారివలెనే నిలువఁబడియుండెను.

మొగసాల తెఱవఁబడఁగనే సూపర్నెంటు గోపురాకారముగా నున్న నడిమేడమీఁది కేఁగి కాకితములపని కొంత చూచుకొనియెను. పిమ్మట నతఁ డుద్యోగుల నందఱను అచటి కాహ్వానించెను. ఒకరితరువాత మఱియొక రందఱును అచటికి వచ్చిరి.

వ్రాసిన కాకితము నొకటితీసి వారి కిచ్చి సూపర్నెంటు—'దీనిని చదివికొని మీ యందఱి సమ్మతిని తెలుపుఁ' డనెను.

ఒకరితరువాత మఱియొక రా కాకితమును జదివికొనిరి. అందఱు నొకవిధమగు సంకోచముతో ఒకరి మొగము మఱియొకరు చూచుచు తలలూఁపుచు బయటికి వచ్చుచు లోపలికిఁ బోవుచు నుండిరి.

సూపర్నెంటు వారిని బిలిచి—'మీకొక పావుగంట గడు విచ్చితిని. బాగుగా ఆలోచించుకొని మీ నిశ్చయమును ఏకగ్రీవముగాఁ దెలుపవచ్చును' అనెను. ఈమాటలు విని వా రాలోచించుకొనుటకు వెళ్లిపోయిరి.

వారందరటు వెళ్లిన వెంటనే సూపర్నెంటు ముంజేతిగడియారమును ముందుంచుకొని ఒకొక్క నిముసమునే పరికించుచు—ఒకటి, రెండు, మూఁడు, నాలుగు, అయిదు, ఊ. దీనికడుపు కాల! నడవదు' అనుకొనెను.

వలయువాని కేడాది యొక నిముసము. అక్కఱలేనివానికి నిముస మొక యేడాది.

పట్టుమని పదినిముసములు కాకముందే డెప్యూటీజైలర చటికి వచ్చెను.

'మీ రయిదునిముసము లు కాకముందే వచ్చుటవలన సమ్మతించితిరని భావింపవచ్చునా?'

'మే మందఱమును సమ్మతించితిమి గాని జైలరుమాత్రము.........'

'మంచిది. నాకు చాల సమయమును కూడఁదీసిపెట్టినాఁడు. అతని నొకతూరియిటకు బంపుఁడు!'

డెప్యూటీజయిలరు వెళ్లెను. జయిలరు వచ్చెను.

'ఉరికాకితముమీఁద రేపటి తారీఖువేసి సంతకము చేయవా?'

'రేపు నేఁడుగా మాఱునా?'

'చెడకు. ౨గీ౬౭ నేరము తెలియునా? రాజద్రోహముకన్న పెద్దది. Lese Majeste. రేపు జరుగవలసిన ఉరి నేఁడే జరుగును. రేపు నేనిచట నున్నచో నాపెండ్లికి ఉరి.'

'ప్రాణములు నేఁడు పోయినచో రేపు రావు. పెండ్లి రేపుగాకున్న నెల్లుండి. ఎల్లుండి గాకున్న నేఁడాదికేని కావచ్చును.'

'రేపు నీ పతనికి ప్రాణములు తెచ్చి యిత్తువా?'

'రేపీయఁజాలనుగాని ఈ యిరువదినాల్గు గంటలు ఇత్తును.'

'దానికేని నీకు స్వాతంత్ర్యము. కలదు కాఁబోలు. కలరా వచ్చి చచ్చుచో? ఇఁకఁ జాలు. చదువులు చదువకు. సూపర్నెంటు కీచదువులు తెలియును. నీకు ఇష్టము లేదేని వెళ్లిపోవచ్చునుగాని ఇదిగో నీప్రమోషనుకు ఆర్డరు తెప్పించితిని. తీసికొని పొమ్ము.'

జైలరు తీసికొనెను. అతని మొగము చెలువాయెను. సూపర్నెంటు కనిపట్టెను.

'ఇఁక నీవు వెళ్లవచ్చును.'

జైలరు బొటనవ్రేలితో నేల రాచుచు 'సంతకము చేయుదును' అనెను.

'ఇష్టములేనిచో బలాత్కారము లేదు.'

చిఱునగవుతో జైలరు 'చేయుదును' అనెను.

'మంచిది' అని సూపర్నెంటు కలమును కాగితమును కొన్ని కాకితములను అతనికిచ్చి వధ్యశాలలోనికిఁ బోయెను.

ఆకాశమునుండి వ్రేలాడు నురిత్రాడు, దానికిసూటిగా క్రింద రాతితోఁ గట్టఁబడిన పెద్దగోయి, దానిలో వేసియుంచిన ఎత్తుబల్ల, బరువునకుఁ గాను రెండు కాళ్లకును కట్టఁదగిన రెండు ఇసుకబస్తాలు మొదలగు పరికరము నంతయు నతఁడు పరీక్షించి ౨౫౬౭ కొఱకు ప్రతీక్షించుచుండెను.

జైలుసూపర్నెంటు పెద్దపెద్దపరీక్షలిచ్చిన వాఁడే. ఉరిశిక్ష ఉండదగునా, ఉండఁగూడదా యని విచారణను చేయఁగలవాఁడే. వేలాది జీతము తీసికొనువాఁడే. సంఘమునందు చాల మరియాదగలవాఁడే. కాని దుఃఖదగ్ధులగు జీవులతో నతని క్రీడ. ఈక్రీడ నాఁపివైచుట కాతనికన్న నధికారి యెవఁడు?

యమవాహనపు ఘంటాధ్వనులతో ౨౫౬౭ ఆగుహంలోఁ బ్రవేశించెను. 'సిద్ధముగ నుంటివా?' అని సూపర్నెంటనెను. 'మీరే సిద్ధముగ నుండవలయును' అని ౨౫౬౭ అనెను. పనిబాగులవారికీయవలసిన సొమ్మిచ్చి సూపర్నెంటు తలుపులుమూసి బయటికి వచ్చి పనులుచూచికొని మోటారెక్కి వెళ్లిపోయెను. తానుపోయిన పొడుగునను 'మీరే సిద్ధముగ నుండవలయు' ననుమాట అతనిని వెంబడించుచునే యుండెను.

౬

డెప్యూటీజయిలరు వైద్యులు మొదలగు నుద్యోగు లందఱు పెండ్లికి వెళ్లిరి. రేపు రాఁగలరు.

నేఁడు జయిలరే డెప్యూటీజయిలరు, వైద్యుఁడు, మఱియు సూపర్నెంటు. ఖయిదీల

కును పనిబాగులవారికిని చిల్లర మల్లర ఉద్యోగులకును అతఁడు నేఁడు పెద్ద.

పంతులు లేనపుడు బడిపెద్దయే పంతులు. బడిపెద్ద తాను పంతు లనుకొనును. కాని బడిపిల్ల లతనిని వెక్కిరింతురు.

జయిలరు సూపర్నెంటుపనులు చూడ దొరకొనెను. నేఁటి సూపర్నెంటు దేనికిని అనుజ్ఞ యిచ్చుటలేదు. విజిటరులకు ఖయిదీలను జూడ ననుజ్ఞ లేదు. ఖయిదీలకు వచ్చిన ఉత్తరములను చింపి చదివించికొని వినుటలేదు. ఖయిదీలపరీక్ష లేదు. ఖయిదీల మనవులను చిత్తగించుటలేదు. ఏమియు లేదు. కాని అతఁడు సూపర్నెంటు. దానికి చిహ్నముగా నతఁడు సూపర్నెంటు కుర్చీమీఁదఁ గూరుచుండెను. సిగరెట్లు కాల్చుచుండెను.

అతని కేమియు తోఁపలేదు. మేడ దిగి క్రిందికి వచ్చెను. పాకశాలలోనికిఁ బోయి చూచెను. మొగసాలముంగిలికి వచ్చెను. వీథి దెస చూచుచు నిలువఁబడియెను. కొంతవడి కొకతె యతనిచూపునఁ బడెను. ఆమెముఖము గాండ్రిల్లియుండెను. కలువరేకులవంటి కనుల నుండి నీరు జాఱుచుండెను. గండస్థలములు రక్తోత్పలములు. వాఁడిపోవఁగా నీటఁ బడవయిచిన గులాబీరేకులా పెదవులు.

తాను సూపర్నెంటనుమాట నతఁడు మఱచిపోయెను. మామూలు మనుష్యుఁడై వాకిటికి వచ్చెను.

ఆమె కట్టుకొనినచీరెను, తొడిగికొనిన రైకను, మేనిమార్దవమును, సౌందర్యమునుజూచి ఒకడుగు వెనుకకు వయిచెను.

దూరముగా నొకచెట్టుక్రింద తలలువంచుకొని దుఃఖించుచుఁ గూరుచుండిన స్త్రీలు కొందఱును పురుషులు కొందఱును అతనికిఁ గానిపించిరి.

'అమ్మా! ఏలదుఃఖించెదవు? దుఃఖము గూడ భయఁపడుప్రదేశమే యిది.'

'కాఁబోలును. కాని నాదుఃఖము భయ మెఱుఁగదు. నా కిఁక దుఃఖ మెంతసేపో ఉండదు.'

'ఏ మది?'

'నేఁడు ఉరితీయఁబడువారి శరీరమును నా కీయఁగోరెదను. తాము నా కిందులకు సాయము చేయఁ గోరెదను.'

జయిలరు నేలదెసఁజూచి మూఁగవాఁడై పోయెను.

ఆమె యతనిని ఆచి చూచుచుండెను.

'అయ్యా! మాటాడరు.'

జయిలరు మాటాడలేదు. వెనుదిరిగిపోవఁ జూచెను.

'వారసలు రాజద్రోహ మేమియుఁ జేయలేదు. ఉరి తప్పిపోవుచో మీకు శ్రమయే లేదు.'

'ఉరి తప్పునను ఆశ మీకుఁ గలదా?'

'తప్పక కలదు.'

'ఎటులు ?'

'ఆయన ద్రోహి కాఁడు. సత్యమే సాక్షి. ఉరితప్పుట కింతకంటె ప్రబలమగు నుపాయము వేఱేది?'

'పిచ్చితల్లీ! ఈ కాలమున సత్యము కూట సాక్షి. ఒక అసత్యమును సత్యము చేయుటకు పదిమంది చెప్పుటయే తరవాయి. ఇది వోట్ల యుగము.'

'కాదు, సత్యమునకే జయము.'

'ఆమాట నిక్కమే. సత్యము బయటఁబడ వచ్చును. ఫలము మాత్రము శూన్యము.'

'పోనిండు! వారిశరీరమును నాకిప్పింపరా?'

'అదియు వీలుండదు. అతఁడు రాజ ద్రోహి.'

'ఆమె కనులనుండి ధారాళముగా నీ రురులఁజొచ్చెను.

'మీ రిచట నిఁక నుండరాదు. ఆవలికి పొండు.' అని యతఁడు వెనుదిరిగి పోఁజొచ్చెను. ఆమె వెక్కి వెక్కి యేడ్చుచు వెంబడించు చుండెను. అతఁడు ముందు, ఆమె వెనుక.

ఇంతలో టపాజవా నొకఁడు త్రొక్కుడు బండిమీఁద వడివడిగా వా రిరువురను తప్పించుకొని మొగసాలకడ నాఁగి 'సార్ సార్' అని పిలువఁదొడఁగెను.

జయిలరు వడిగా నడచి 'ఏమిటోయీ ఆగోల? మెల్లగా పిలువరాదూ?' అనెను.

'మెల్లగా గాదు. బిగ్గరగా పిలువవలెను. నే నొక ప్రాణాన్ని రక్షించడానికి నురుఁగులు కక్కుకుంటూ వచ్చా. సూపర్నెంటుగా రేరీ? సార్ సార్ !'

'ఏమిటోయ్ గడబిడ! మెల్లగా చెప్పు.'

'ఆ జమీందారుకు రాయనకు ఉరిశిక్ష తొలఁగిం దని అర్జంటు టెలిగ్రాము వచ్చింది. నాకు జమీందారుగారిదగ్గఱ ఈనాముకూడా దొరుకుతుంది. ఏరీ ఏరీ, దొరగారు ?'

'నాయనా! నూఱేండ్లు బ్రతుకు! ఇదిగో నీకు ఈనాము' అని వెనుక నిలిచియున్న యామె తన మెడలోని హారమును టపాజవానుకు ఈయ చేయిఁజాఁచెను. ఆశ్చర్యపడి టపాజవాను తీసికొనుటకు తటపటాయించుచుండఁగా ఆమె దాని నతనిమీఁదికి విసరివైచెను.

అతఁడు పుచ్చుకొని 'అమ్మా మీ రెవరు?' అనెను.

ఆమె మాటాడలేదు.

'అమ్మా, మీగులాముకు నన్ను మఱవకుఁడు!' అనెను.

జయిలరు తెల్లఁబోయి చూచుచుండెను.

'ఏదయ్యా సూపర్నెంటు' అని టపాజవాను గద్దించెను.

'జయిలులో పని చూచుకొనుచున్నారు. అక్కడ పడవయిచి పొమ్ము!'

'మీరయినా కొంచెం చెయ్యిచేసుకోండి.'

'సరే' అని జయిలరు సంతకము చేసెను. టపాజవాను మఱియొకమా ఱామెకు నమస్కారము చేసి 'రాజావారిని రైలు దగ్గఱ దర్శనం చేసుకుంటాను.' అని వెళ్లిపోయెను.

'అమ్మా! మీ రీ చుట్టుప్రక్కల నుండ రాదు. బయటి పిట్టగోడ కావల నుండుఁడు. ఊఁ. వడిగా పొండు! సిపాయికి పని కల్పింపకుఁడు!'

ఆమె నగుమోముతో గోడయావలి కేఁగెను.

కొంతవడి కామె బంధుగుల మొగము లన్నియు ఆనందముచే దీపించెను. వా రంద ఱును వాకిలిని కనులతో కాపలా కాయుచుండిరి.

తమతమ పను లయినపిదప వార్డరులు రాకపోకలు చేయుచుండిరి. జయిలరు వెళ్లిపోయెను.

ఆమెయు ఆమె బంధుగులును సూపర్నెంటునుగుఱించియు, జైలరుగుఱించియు ప్రశ్నించిరి. కాని వారి కెవరును సమాధాన మొసఁగలేదు. ఇటు లారాత్రి గడఁచెను.

మఱునాఁడు సూపర్నెంటు పెండ్లికొడుకై వచ్చెను.

అతడు కురిచీలోఁ గూరుచుండి ప్రాఁత బల్లమీఁద ఎదురుగా పడియున్న టెలిగ్రాము ను విప్పి చూచికొని అప్రయత్నముగా కురిచీ వెనుక కానుకొనియెను.

వ న దే వ త లు

ఎ. వి. రత్నముగారు

ప్రకృతి కాంత యనంత విలాసలీల
విశ్వనాట్యరంగమునను విశ్వమోహ
నముగ సల్పెడి నృత్యమునకు దగనట
రాజు పట్టిన మాయతెరయన మున్ను,—

గగనము వెలసె క్రమముగఁ గల్గె నందు
స్పర్శరసరూప సురభుల్ పరిమిత మహి
మాన్విత మహాపదార్థము లనిల వహ్ని
సలిలధాతులు, ప్రకృతిలాంఛనము లనఁగ.

వెలిఁగె తేజము, పరమాత్మ విమల దివ్య
సత్త్వరూపము, విశ్వవిస్తారమై, ది
గంతరాళములందు నిరంతరముగ
ప్రకృతి ముఖమండల మనోజ్ఞ రాగమనఁగ.

దివ్యతేజుల్ నభోమణి దినకరుండు
మోహనరజత మృదుకాంతిమూర్తి రజని
కరుఁడు జ్యోతిర్మణులు తారకలును గడు ర
హించెను ప్రకృతి మాళిధరించె ననఁగ.